రెండు రోజులదాకా రాడు. తనే పోయి యిచ్చేద్దామని బయలుదేరింది.

బస్ డిపోకి రాగానే కాకినాడ ఎక్స్‌ప్రెస్ దొరికింది ఖాళీగానే వుంది. సూట్‌కేస్ పైన పెట్టి ఎదర సీట్లో కూర్చుంది. రెండింటికి బస్ బయలుదేరింది.

తాడేపల్లిగూడెం రాగానే మనోరమకి తలపోటు ప్రారంభమైంది. టీ త్రాగాలనిపించింది కాని బస్సు ఆగలేదు. తణుకులో ఆగింది.

మనోరమ క్యాంటీన్‌లోకి వెళ్ళింది. ఆమె వచ్చేసరికి సూట్‌కేస్ లేదు! కండక్టర్‌తో చెప్పింది.

"మీ సామాను మీరే భద్రం చేసుకోవాలమ్మా. దానికి మేం ఏం చేయగలం? రిపోర్టు యివ్వండి!"

ప్రయాణీకులు ప్రశ్నలు గుప్పించారు. వ్యాఖ్యానాలు చేశారు. మనోరమకి కాకినాడ వెళ్ళాలనిపించలేదు. వెళ్ళి ఏం చేయడం? హాండ్‌బ్యాగ్‌లో పదిహేను రూపాయలున్నాయి. విజయవాడ తిరిగి వచ్చింది. రెండు వేలు. బట్టలు పోవడం ఆమెకి బాధగా వుంది.

మర్నాడు మధ్యాన్నం వచ్చాడు ఆనందం. రాగానే చెప్పేసింది- "ఎవడో దొంగ వెధవ పుణ్యం గట్టుకున్నాడండీ.."

"పోనెద్దూ.... వృధాగా తిట్టుకోవడం ఎందుకు? పోతేపోయింది. మనకి ప్రాప్తం లేదు. మళ్ళీ పంపు... ఇదిగో ఈ డబ్బు లోపలపెట్టు" ఆనందం స్నానానికి వెళ్ళిపోయాడు.

అది మాసిన అయిదు రూపాయల కట్ట. ఎర్రదారంతో కట్టబడి వుంది. మనోరమకి అనుమానం వచ్చి కట్ట తీసింది.... కొన్నిటి మీద తన సంతకం వుంది. ఇది తను పోగొట్టుకున్న కట్ట. భర్తకి ఎలావచ్చింది?

వాస్తవానికి మనోరమ సూట్‌కేస్ ఎవడో కొట్టేశాడు. వాడి దగ్గర్నించి ఆనందం కొట్టేశాడు. బట్టలు డ్రామా కంపెనివారికి అమ్మి, డబ్బు యింటికి తెచ్చివుంటాడు మనోరమ అనుమానం వల్ల మామూలుగా వుండలేకపోయింది.

రాత్రి భోజనాలదగ్గర కబుర్లలో "మీ ఆఫీసు ఫోన్ నెంబర్ ఎంతండీ?" అంది. ఆనందం ఏదో చెప్పాడు.

మనోరమ భర్త బయటకి వెళ్ళగానే ఆ నెంబర్‌కి ఫోన్ చేసింది.

"హాస్పటల్ మేనేజర్ని .... ఏంకావాలి?"

"అదేమిటి.... హసన్ బ్రదర్స్ ఎక్స్‌పోర్టు కంపెనీ కాదా?"

"సారీ రాంగ్ నెంబర్."

అబద్ధం చెప్పాడు భర్త. అంటే అతడు పనిచేయటం లేదన్నమాట! అయితే ఏం చేస్తున్నాడు? ఇంత డబ్బు ఎలా వస్తోంది?

ఇంతలో ఆమె అన్నగారు చూడడానికి వచ్చారు. "మీ బావగారి ఆఫీసుకు వెళ్ళన్నయ్యా .. కాలక్షేపంగా వుంటుంది"

ఆనందం గతుక్కుమన్నాడు. బావమరదిని అక్కడా అక్కడా తిప్పాడు. ఇంటికి తీసుకువచ్చాడు.

"తీసుకెళ్లారా అన్నయ్యా!" రహస్యంగా అడిగింది.

"స్ట్రిక్టటమ్మా. ఎవరూ లేరట!"

మనోరమ సందేహం తీరిపోయింది. తన భర్త ఉద్యోగికాదు.

ప్రొద్దుటే ఆమె అన్నగారు వెళ్ళిపోయాడు. "మనం ఒకచోటకి వెళుతున్నాం ... రండి.... యిక్కడ చెప్పను. సస్పెన్స్!" అంది.

ఆటో దిగి యిద్దరూ నడవసాగేరు.

"ఎక్కడికి మనో."

"అదిగో అక్కడిదాకా!" వేలెత్తి చూపింది.

అది జైలు. ఇక్కడికి ఎందుకు తీసుకు వచ్చిందో అర్థం కాలేదు. "పోదామా!" అంది. తలూపాడు. ఇద్దరూ బయలుదేరారు ఆమె ప్రవర్తన చాలా ఆశ్చర్యంగా వుంది.

"ఇప్పుడంటే మీరు వెంటనే వచ్చేస్తున్నారు. ఒకనాడు ఇక్కడే వుండిపోవల్సి వస్తుంది. ఆ పరిస్థితి వస్తే నేను ఎండ్రిన్ త్రాగుతాను సో.... శవాలంకరణ వద్దు.... కూలి పని నా భర్త చేస్తున్నాడని సగర్వంగా చెప్పుకోగలను. ఇప్పుడు దొంగ భార్యని. రేపు దొంగ తల్లిని...."

ఆనందం కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "స్టాప్, ఐ విల్‌స్టాప్ దిస్."

---

# రూపా రూపాలు



ఇంద్రగంటి జానకీబాల

నేను బస్సు స్టాండులో అడుగు పెట్టేసరికి విజయవాడ– గుంటూరు నాన్‌స్టాప్ బస్సు రెడీగా వుంది. రెండు అడుగులు వేగంగా వేసి బస్సు ఎక్కాను. గుమ్మంలో అడ్డంగా నుంచున్న ఒకతను "టిక్కెట్టు బుకింగ్‌లో తీసుకోవాలండి" అన్నాడు.

నేను అతనికేసి చూశాను. ఆ చూపులో నిరసన మెరిసే వుంటుంది. కారణం– నా జేబులో వున్న వారంటు. నేను ఆర్.టి.సి. ఉద్యోగిని.

"స్టాఫ్" అన్నాను అతనేమీ మాట్లాడలేదు. కిటికీ పక్కన సీటులో సర్దుకుని కూర్చున్నాను. జనం ఎక్కువగా లేకపోవడంవల్ల ఒక్కొక్కరేవచ్చి నచ్చిన సీటు చూసుకుని కూర్చుంటున్నారు.

నేను సన్నగా, పొట్టిగా వుండడంవల్ల చాలామంది నన్ను కుర్రాడనే అనుకుంటారు. వాళ్ళు అలా అనుకోవడం నాకేమీ బాధగావుండదు ఆనందంగానే వుంటుంది. నేను ఎకవుంటెంట్ హోదాలో వున్నానని గాని, బలమైన యూనియన్‌కి సెక్రటరీ కొమ్మలాంటి వాడననిగాని నన్ను చూసి ఎవ్వరూ అనుకోరు. మా ఆఫీసర్ నన్ను 'బోయ్' అని వ్యవహరించినపుడు నాకెంతో ఆనందంగా వుంటుంది. ఆఫీసులో ప్రతివాడూ 'పొట్టివాడికి పుట్టెడు బుద్ధులు' 'పిట్ట కొంచెం కూతఘనం' వగైరా మాటలతో ఎగతాళి చేస్తుంటే అది నా ప్రతిభకి గుర్తింపు అనిపిస్తుంది.

ఎవరేమనుకున్నా నా పనే నాకు. మరో విషయం పట్టించుకోను.

డ్రైవరు ఎక్కాడు ఎస్. ఆర్. తీసుకుని టిక్కెట్లు లెక్కపెట్టుకోవడం మొదలుపెటాడు.

అతన్నిచూసి నాకు గుండెల్లుల్లుమంది ఎందుకో భయమేసింది. నల్లగా, ఆరడుగుల ఎత్తుమనిషి- మూతిమీద మూరెడు గుబురు మీసం అతని ఆకారాన్ని మరింత భయంకరంగా చేస్తోంది. సినిమాల్లో మేకప్ చేసిన గూండాలా యెడం చెంపమీద కత్తిగాటు, నుదుటిమీద కుడివైపు నల్లని మచ్చ.

అతని రూపం చూసి అతను కుహాకర్కోటకుడై వుండాలని నేను నిర్ణయించుకున్నాను.

బస్సులో ఎవరైనా టిక్కెట్ తీసు

క్రోనాలా అంటూ ఒక్క కేక పెటాడు. ఆ కింఠం కూడా కర్కశంగానే వుంది.

ఆలోచనల్లో వుండి నేను "స్టాఫ్" అని, నా దగ్గర వారంటు వుందని చెప్పడం మర్చిపోయాను.

అతను లెక్కపెట్టడంమొదలుపెట్టాడు. వత్తికాయల్లాంటి అతనికళ్ళు వొక్కొక్క మనిషిమీంచీ అతివేగంగా దొర్లుతున్నాయి. ఆ చూపు నా దగర ఆగింది. వెంటనే నేను "స్టాఫ్" అన్నాను.

"చంపారుపొండి, మరి చెప్పరేంటీ.." అని "పాసుందా" అన్నాడు.

నాకెంతో అవమానం అన్పించింది. వెంటనే గర్వంగా "వారంట్" అన్నాను. అంతే! అతను ఒక్కుదుటున స్టీరింగ్ ముందు కూర్చున్నాడు. అతని బరువుకి బస్సంతా వూగింది. బస్సు స్టార్టు చెయ్యడం, సర్రున ముందున్న బస్సుని దాటించి అదే పనిగా హారన్ మోగించుకుంటూ దూసుకుపోవడం ఒకేసారి జరిగాయి. గేట్లోంచి రోడ్డుమీదకొచ్చి జనప్రవాహాన్ని చీల్చుకుంటూ వేగాన్ని పుంజుకుంది బస్సు.

ఆ వేగానికి నాలుగున్నరడుగుల ఎత్తూ, పీలగా, అర్భకంగావున్న నేను సీట్లో కూర్చోవడం కష్టమవుతూంది. నా పాదాలు పూర్తిగా క్రింద ఆనడం లేదు. బరువు తక్కువ కావడంవల్ల ఎటుపడితే అటు ఒరిగిపోతున్నాను. డ్రైవర్‌మీద ఎక్కడలేని కోపం, అశక్తతవల్ల చిరాకు, అహంకారంవల్ల కసి నాలో పొంగుకొచ్చాయి. బస్సు హైవే మీద కొచ్చింది. రోడ్డుమీద వెళ్తోందో, గాలిలో తేల్తోందో తెలీడంలేదు భయంతో గుండెలు దడదడ లాడుతున్నాయి. 'ఈ రోజుతో భూమ్మీద నూకలు సరి' అనుకున్నా. ముందున్న ప్రతీ వాహనం క్షణాలమీద కనుమరుగవుతోంది.

నలభైమంది ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఆ నరరూపరాక్షసుణ్ణి చూసే నాకు ఒళ్ళు మండిపోయింది. గ్యాస్ హారన్‌తో చెవులు చిల్లులు పడుతున్నాయి. దానికితోడు బస్సు వేగానికి గాలి ముఖాన్ని బద్దలు కొడుతూంది. నేనొక్కణ్ణే యిలా అనుకుంటున్నానా - అంతా యింతేనా? అని చుట్టూ చూశాను. మిగిలిన వాళ్ళందరూ హాయిగా కూర్చున్నారు. అప్పటికే కొందరు నిద్దర్లో జారుకున్నారు. బస్సుని మించిన శబ్దంతో కొందరు మాటాడుకుంటున్నారు. లేడీస్ సీట్లో కూర్చున్న ఒకమ్మాయి మాత్రం నాకేసే చూస్తోంది.



## "ఓ ప్రభూ!"

అజ్ఞాన తిమిరంనుంచి
ప్రత్యూషాన్ని దర్శించలేని
మా కోసం
శిలువపై నీవు చిందించిన
రుధిర ధారలు
గొల్గొతా క్షుదిత పాషాణాలలోనే
ఇంకిపోయాయి ప్రభూ!

మహర్షి పీటర్‌కు వారసుల్లేరిక్కడ
సేతన్ హృదయ పీఠాన్నధిరోహించా
డిప్పుడు
మేమంతా పశ్చాత్తాపంలేని యూదా
బిడ్డలమైపోయాం.

—పోలవరపు గోపి

ఆమె పెదవుల మీద నవ్వు నన్నుడికించింది.

డ్రైవర్‌మీద మరింత కసి పెరిగింది నా కసి పెరుగుతున్నకొద్దీ బస్సు వేగం పెరుగుతోందా అన్పించింది.

మంగళగిరి ఊళ్ళోకి వచ్చినపుడు తప్పనిసరై వేగం తగ్గింది. ఊరి పొలిమేరలో పంచాయతీవారి "నమస్తే" గుర్రున తిరిగి మాయమయింది మళ్ళీ మామూలే!

అంతటి సామ్యవాద భావాలు కలవాణ్ణీ ఒక్కసారి దేవుణ్ణి స్మరించాను ఈ బస్సు గుంటూరు చేరదు అని నిర్ధారణ చేసేసుకుని గట్టిగా కళ్ళుమూసుకున్నాను. వెనకనించి 'అయ్యో'అంటూ అరిచారెవరో. బస్సు సడన్ బ్రేకుతో ఆగింది. నాతల యెదురుగావున్న యినపరాడ్‌కి కొట్టుకుంది. ప్రాణం జిలార్చుకుపోయింది. సన్నగా, తెలగా పిండిబొమ్మలాగున్న ఒకామె వాంతి చేసుకుంటోంది. "ఆమె పావుగంటనించీ బాధపడుతూంది" అన్నారెవరో.

నాకు భలే సంతోషం వేసింది. నలుగురూ కలిసి ఆ డ్రైవరు అంత స్పీడుగా బస్సు నడుపుతున్నందుకు చీవాటువేస్తారు - తగిన శాస్తి జరుగుతుంది అయినా అంత పొగరేవిటీ అని సంబరపడడం మొదలుపెట్టాను.

కాని, యెవ్వరూ ఆ విషయం యెత్త లేదు. డ్రైవరు వెనక్కొచ్చి-

"ఏమ్మా చెప్పకపోయావా, ఆపేవాణ్ణిగా!" అన్నాడు యెంతో దయగా.

అప్పుడతని ముఖంలో నేనంత క్రితం వూహించిన కాఠిన్యంలేదు అతని కళ్ళల్లో ఆ అర్భకురాలిమీద ఎంతో జాలి కనిపిస్తోంది అతని గుబురు మీసాలూ, కత్తిగాటూ ఇవన్నీ అతని మనసులోంచి పొంగే కరుణకీ, దయకీ అడ్డు రాలేదు.

నాకెంతో ఉక్రోషంగా అనిపించింది. "బస్సు అంత స్పీడుగా పోతే మామూలు వాళ్ళకే ప్రాణాలు ఎగిరిపోతున్నాయి" అన్నానుండబట్టలేక.

"బస్సు స్పీడుగా కాకపోతే చీమలా పోతుందా సార్" అన్నారెవరో.

'మరే మరే' అని అంతా తలూపారు. నన్నెవరూ సమర్థించలేదు. నేను కిటికీలోంచి తల బయటకుపెట్టి చూడడం మొదలుపెట్టాను.

డ్రైవరెక్కణ్ణించో చెంబుతో నీళ్ళు పట్టుకొచ్చి ఆమెకిచ్చాడు. ఆమె ఆ నీళ్ళతో ముఖం కడుక్కొని కొంచెం తేరుకొని బస్సెక్కి మెల్లగా సీటులో జారగిలబడింది.

"రైట్" అన్నారెవరో డోర్‌మూస్తూ. బస్సు ఒక్కుదుటున కదిలింది అర నిమిషంలో ఊహించని వేగాన్ని అందుకుంది.

గుండె ధైర్యంలేని నేను మాత్రం గట్టిగా కళ్ళు మూసుకుని కూర్చున్నాను ●